# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 24, సెప్టెంబర్ 2025


# పొరుగు సేవల పద్ధతిన పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



*** జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త

పొరుగు సేవల పద్ధతిన జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో 6 నెలలు (మార్చి 31, 2026) వరకు పని చేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 పబ్లిసిటీ అసిస్టెంట్ ఫోటోగ్రాఫర్, 1 వీడియో కెమెరామెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఫోటోగ్రాఫర్ పోస్టుకు 10వ తరగతి సమానమైన విద్యార్హత కలిగి ఉండి పరపతి కలిగిన ఫోటో స్టూడియోలో 5 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలని, వీడియో కెమెరామెన్ పోస్టుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల నుంచి సినిమాటోగ్రఫీ డిప్లొమా లేక సమాన అర్హత కలిగి ఉండాలని తెలిపారు. ఈ నెల 26 తేదీలోగా అర్హత గల అభ్యర్థులు తగు ధ్రువపత్రాలు జత చేసి దరఖాస్తులను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ పనివేళలలో సమర్పించాలని తెలిపారు. ఆసక్తి, అర్హత కల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



# వైద్య పద్ధతులకు ఆద్యం ఆయుర్వేద వైద్యం

*** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త

ప్రపంచంలోని వివిధ వైద్య పద్ధతులకు భారతీయ ఆయుర్వేద వైద్యం ఆద్యం పోసిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం 10వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆర్ఎంఓ భీష్మ, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ రకాల వైద్య పద్ధతులకు మిగతా 2లో..

# మహిళా సంఘాల బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**★ రామకృష్ణాపూర్‌లో మెప్మా భవనం ప్రారంభించిన మంత్రి**

రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఠాగూర్ స్టేడియంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మెప్మా భవనాన్ని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడం ద్వారా ప్రభుత్వం ఆత్మస్థైర్యాన్ని కల్పిస్తుంది. అలాగే, మహిళా శక్తి సంఘాలకు ఇప్పటివరకు రూ.21 వేల కోట్లు వడ్డీ రహిత రుణాలుగా అందించామని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే వారి కుటుంబాలు బలపడతాయని, 2004లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి మహిళా సంఘాలకు పావల వడ్డీ రుణాలను అందించారని గుర్తుచేశారు. అదేవిధంగా ఉచిత బస్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.10 వేల కోట్లను ఖర్చు చేసినట్టు వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే వారి కుటుంబాలు బలపడతాయని, మేప్మా ద్వారా మహిళల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టనుంది అని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గాదిరాజు మాట్లాడుతూ, మహిళా సంఘాల పురోగతిపట్టణ పరిధిలో ప్రస్తుతం 567 సంఘాలు, 5948 మంది సభ్యులు కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అదనంగా 7 ఫెడరేషన్లు, 12 సానిటేషన్ సంఘాలు, 23 స్థాయి సమాఖ్యలు మరియు ఒక పట్టణ సమాఖ్య ఉన్నాయి. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో 36 కొత్త సం ఘాలు – 360 మంది సభ్యులు ఏర్పడ్డారు అన్నారు. మహిళల బలోపేతంబ్యాంక్ లింకేజీ ద్వారా: రూ.5931.65 లక్షలు రివాల్వింగ్ ఫండ్ ద్వారా: రూ.450.98 లక్షలు సెప్టెంబర్ రుణాలుగా: రూ.27 లక్షలుపీఎం స్వనిధి పథకం కింద 2210 వ్యాపా రులకు రూ.419.40 లక్షలువడ్డీ సబ్సిడీ రుణాలు: రూ.162.39 లక్షలు అందించినట్టు స్పష్టం చేశారు, కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని సహించేది లేదు

- సింగరేణికి రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలి
- తెలంగాణ సంస్కృతి, కళలు కాపాడుకోవాలి
- హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- శ్రీరాంపూర్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కల్వకుంట్ల కవిత
- జై సింగరేణి, జై తెలంగాణ నినాదాలతో దద్దరిల్లిన ప్రగతి స్టేడియం



నస్పూర్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త

సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యాన్ని సహించేది లేదని సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్) గౌరవ అధక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మంగళవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్) తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. మొదట హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డి నివాసంలో సింగరేణి కార్మికులు, స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మను పేర్చారు. సాయంత్రం కవిత నెత్తిన బతుకమ్మను ఎత్తుకొని ఆర్.కె 8 కాలనీ సాయి బాబా మందిరం నుంచి ప్రగతి స్టేడియం మిగతా 2లో..



# వైద్య పద్ధతులకు ఆద్యం ఆయుర్వేద వైద్యం

*(మొదటిపేజీ తరువాయి)*

భారతీయ ఆయుర్వేద వైద్యం పునాది లాంటిదని అన్నారు. నాచురోపతి, యునాని, యోగ ఇతర అనేక పద్ధతులను వినియోగించి అనేక రకాల వ్యాధులను తగ్గించడం జరుగుతుందని తెలిపారు. ఆయుర్వేద పద్ధతుల ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించవచ్చని, ప్రతి నిత్యం యోగా చేయడం ద్వారా దైనందిన జీవితంలో ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. జిల్లాలో ఆయుష్ వైద్యాధికారులు అందుబాటులో ఉన్నారని, మధుమేహం, రక్త పోటు, వివిధ రకాల వ్యాధులకు వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్‌లో చేరిన బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షుడు

**నేరడిగొండ, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త**

మండలంలోని బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షుడు చెట్పల్లి వెంకటేష్ మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరితోపాటు కిసాన్ మోర్చా మండల కార్యదర్శి ఉయిక గంగాధర్, మండల ఉపాధ్యక్షుడు సంజీవ్‌తో పాటు పలువురు బిజెపి నాయకులకు గులాబీ కండువా తప్పుకున్నారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్నది టిఆర్ఎస్ ప్రభుత్వం అనిల్ జాదవ్ నాయకత్వంలో బోథ్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని నమ్మి పార్టీలో చేరడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం టిఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ప్రతి కార్యకర్త పార్టీ బలోపే దానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ సజన్, దేవేందర్ రెడ్డి పలువురు నాయకులు ఉన్నారు .



## పిహెచ్‌సిలో వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయండి

**రెబ్బెన, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుద్ధ జల మినరల్ వాటర్ ప్లాంట్ ను మరమ్మత్తు చేయాలని, రోగులకు సురక్షితమైన త్రాగునీటిని అందించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. గత కొన్ని నెలలుగా శుద్ధ జల వాటర్ ప్లాంట్ పని చేయకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు త్రాగునీటి కోసం అవస్థలు పడుతున్నా విషయం తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. వెంటనే మరమ్మత్తులు చేసి త్రాగునీటి అందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## డీఐఈఓగా రాందాస్ బాధ్యతల బాధ్యతల స్వీకరణ

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

కొమురం భీం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా స్థానిక ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్ గా విధులు నిర్వహిస్తున్న బి.రాందాస్ మంగళవారం అదనపు బాధ్యతల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులు పరీక్షలపై దృష్టి కేంద్రీకరించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు డీఐఈవోగా పనిచేసిన కళ్యాణి ప్రమాదంలో గాయపడి సెలవులో వెళ్లగా ఆమె స్థానంలో రాందాస్ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిఐఈఓకు సిబ్బంది అభినందనలు తెలిపారు.



# సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని సహించేది లేదు

*(మొదటిపేజీ తరువాయి)*

వరకు స్థానిక మహిళలతో కలిసి ర్యాలీగా ప్రగతి స్టేడియానికి చేరుకున్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పెద్ద సంఖ్యలో మహిళలు ప్రగతి స్టేడియానికి తరలి వచ్చారు. ఎమ్మెల్సీ కవితతో సెల్ఫీలు దిగడానికి మహిళలు ఉత్సాహం కనబర్చారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, సింగరేణి అంటే తనకు ఎంతో మక్కువ అని, ఆంధ్ర వలస పాలనలో తెలంగాణ యువతకు సిరుల వేణి సింగరేణి సంస్థ ఉపాధి కల్పించిందని, సింగరేణి కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి వెలుగులు పంచుతున్నారని అన్నారు. సింగరేణి కార్మికులకు లాభాల వాటా పంపిణీలో అంకెల గారడీతో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులను మోసం చేసిందని, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి సంస్థకు వచ్చిన నికర లాభం నుండి కార్మికులకు లాభాల వాటా చెల్లించినట్లు గుర్తు చేశారు. భవిష్యత్తు పెట్టుబడుల కోసం 70 శాతం డబ్బులు పక్కనపెట్టి మిగిలిన డబ్బులలో నుంచి కార్మికులకు 34 శాతం లాభాలు చెల్లించడంతో ఒక్కో కార్మికుడు లక్ష రూపాయల చొప్పున నష్టపోయారని, సింగరేణి కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ ఊరుకోమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని అన్నారు. కార్మికులు, బొగ్గు గనులను కాపాడుకుంటేనే సింగరేణి సంస్థ మనుగడ సాధ్యమని అన్నారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ లేకుండా చేసిన వారికి బతుకమ్మ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. తెలంగాణ సంస్కృతి, కళలు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సింగరేణి కార్మికులతో చర్చించి సమయాన్ని, అవసరాన్ని బట్టి తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. సింగరేణి కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి హెచ్ఎంఎస్, తెలంగాణ జాగృతి సంయుక్తంగా పోరాటాలు చేస్తాయని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందో, పోలీసుల రాజ్యం నడుస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని అన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ప్రతిపక్షానికి పరిమితం చేస్తారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు.



సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం 42 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా, సింగరేణి సంస్థ కొత్త ప్రాజెక్టులు ప్రారంభించడానికి నిధుల కోసం ఎల్ఐసి వద్ద 3 వేల కోట్లు అప్పు అడగాల్సిన పరిస్థితి నెలకొందని, సింగరేణి పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును కార్మికవర్గం గమనించాలని పేర్కొన్నారు. గతంలో అప్పటి గుర్తింపు కార్మిక సంఘం పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలు స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత కేసీఆర్ తిరిగి అమలు చేశారని గుర్తు చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలో రెండు భూగర్భ గనులు మూత పడ్డాయని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడాదికి ఐదు నూతన గనులు ప్రారంభించడానికి చేసిన ప్రణాళికలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, తెలంగాణ జాగృతి స్టేట్ జనరల్ సెక్రటరీ రంగు నవీన చారి, యూత్ స్టేట్ ప్రెసిడెంట్ కంచర్ల శివ రెడ్డి, జాగృతి జిల్లా నాయకులు మేడి రాజశేఖర్, పడల వెంకటేశ్వర గౌడ్, మహేష్ గౌడ్, హెచ్ఎంఎస్ నాయకులు, తెలంగాణ జాగృతి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పండుగ కైనా బకాయి వేతనాలు చెల్లించాలని వినతిపత్రం

**కెరమెరి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

దసరా పండుగకైనా ఎంపీడీవో కార్యాలయ గ్రామపంచాయతీ సిబ్బందికి మూడు నెలల బకాయి వేతనం చెల్లించాలని మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యాలయ సిబ్బందికి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కోకన్వీనర్ మడవి అనిల్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు అతి ముఖ్యమైన దసరా పండుగ రోజున గ్రామపంచాయతీ సిబ్బంది పస్తులు ఉంచకుండా మూడు నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలి. మన రాష్ట్రంలో దసరా పండగ అంటేనే పెద్ద పండుగ గ్రామ పంచాయతీ సిబ్బందికి రావాల్సిన డ్రెస్ బూట్లు సబ్బులు నూనె వస్తువులు ఇవ్వాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉన్నకుడా ఇప్పటి వరకు మాకు వస్తువులు ఇవ్వలేదు. కావున తక్షణమే వేతనాలు చెల్లించాలని లేని పక్షంలో ధర్నాలు చేస్తాం అని హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం పంచాయతీ సిబ్బంది వేతనాలు గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల బ్యాంక్ అకౌంట్లో జమచేయాలి. మల్టీ పర్పస్ వర్కర్ పని విధానం వలన ప్రమాదాలు జరిగి మరణిస్తున్న కార్మికులకు 20 లక్షల నష్టపరిహారం ప్రకటించాలని. జీవో నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని కోరుతూ గ్రామపంచాయితి కార్మికుల మండల ప్రధాన కార్యదర్శి తిరసుల్ల సంతోష్ బుజంగ్ రావు విజయ్ స్వామి నగేష్ భీంరావు పాల్గొన్నారు.





## నానో యూరియాతో రైతులకు ప్రయోజనం

*** మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ**

**కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

నానో యూరియాతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది అని కాగజ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ మండలలోని వంజరి, నందిగూడ గ్రామాల్లో ఆయన పర్యటించి నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించి పలు సూచనలు సలహాలు చేశారు. నానో యూరియా పై రైతులు దృష్టి సారించాలని, నానో యూరియా వాడడం వల్ల వంట దిగుబడి పెరుగుతుందని తెలిపారు. రైతులు అధిక మోతాదులో ఎరువులు వాడి భూసారం కోల్పోకుండా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా నానో యూరియా వాడటం ద్వారా ఖర్చు తక్కువగా ఉంటుందని, ఎలాంటి కాలుష్యం కాదు అని, పంట దిగుబడి కూడా పెరుగుతుందని అన్నారు. సాగు విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయ శాఖ వారినీ సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోగలరు అని అన్నారు. నానో యూరియా వాడి భూసారం కోల్పోకుండా చూసుకోవాలని కోరారు. రైతులు పంట మార్పిడి చేసుకోవాలని అన్నారు. రైతులు ఈ సీజన్‌లో ఏ ఏ పంటలు సాగు చేసారో వాటి పూర్తి వివరాలనూ వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద పంట నమోదు చేసుకోవాలని అన్నారు. కౌలు చేస్తున్న రైతులు కూడా కౌలు పత్రం ఏఈఓలకు లని ఇవ్వాలని అన్నారు. కౌలు పత్రం ఇస్తే పంటలు అమ్మే సమయంలో ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉంటుంది అని అన్నారు. ఆలాగే ఇప్పటివరకు ఫార్మా రిజిస్ట్రేషన్ చేసుకుని రైతులు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన ఏదైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారి సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త



జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబి ప్రాంతంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 300 కోట్ల రూపాయల వ్యయంతో 650 పడకలతో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా జిల్లా కేంద్రంలో ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. అనంతరం రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని ఆర్డిఓ శ్రీనివాస్ రావుతో కలిసి ఆకస్మికంగా సందర్శించి జాతీయ రహదారి 63 నిర్మాణంలో భాగంగా కొనసాగుతున్న పనుల పురోగతి వివరాలను పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన అర్హులైన బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యాలయానికి వచ్చిన అర్జీదారులతో మాట్లాడి వారు వచ్చిన పనుల వివరాలను తెలుసుకున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా త్రాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయాలని, దరఖాస్తులను నిబంధనలకు లోబడి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పసుపు పంట సాగుపై అవగాహన సదస్సు

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త

సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసి అధిక లాభాలను పొందవచ్చని డిఆర్డిఏ ఐకెపి డిపిఎం శోభారాణి అన్నారు. మంగళవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని చైతన్య మండల సమైక్య స్త్రీ శక్తి భవనంలో రైతులకు పసుపు నాణ్యత మెరుగుదలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో ఏ విధంగా పంటను పండించి అధిక లాభాలను పొందవచ్చు అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. వేప ఆకు వేపకాయలతో వేప కషాయం ఏ విధంగా తయారు చేసుకోవాలో జీవామృతం ఎలా తయారు చేసి వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. పసుపు సాగులో మెలకువలు పాటించి తెగుళ్లను ఎదుర్కొంటే అధిక దిగుబడి వస్తుందన్నారు. సరస్వతి మహిళ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీకి సంబంధించిన భూసార పరీక్షలు చేసే మిషన్ ఉందని రైతులు తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. అనంతరం పసుపు పంట పై ఎలాంటి సబ్సిడీలు పథకాలు వంటి వాటిపై వివరించారు. ఇందులో రైతులు, మహిళలు, ఆయా కంపెనీల అధికారులు పాల్గొన్నారు.



## అంధకారంలో గిరిజన గ్రామాలు

### వీధి దీపాలు ఏర్పాటు చేయాలంటున్న గ్రామస్తులు

లింగాపూర్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త

మండలంలోని కొత్తపల్లి (సి) గ్రామంలో ప్రాథమిక సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వీధి దీపాలు లేకపోవడం వలన రాత్రి వేళల్లో ప్రజలు చీకటిలో నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు చాలా ప్రమాదకరంగా మారాయి. చిన్నపిల్లలు వృద్ధులు మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఎన్నిసార్లు అధికారులను కోరినప్పటికీ వీధి లైట్లు ఏర్పాటు చేయకపోవడం గ్రామ ప్రజలలో తీవ్ర అసంతృప్తి కలిగిస్తుంది. ఈ సమస్యను పరిష్కరించవలసిందిగా గ్రామపంచాయతీ కార్యదర్శికి బిజెపి మండల అధ్యక్షులు ఆడే సురేష్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు వినతి పత్రం సమర్పించాడ మైనది. గ్రామ పంచాయతీలో వినియోగించే ట్రాక్టర్ పాడైపోవడం వలన గ్రామంలో చెత్త చెదారం పెరిగి ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అధికారులు త్వరగా స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేసి ట్రాక్టర్ బాగు చేసి గ్రామ ప్రజలకు మేలు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు

## ఆలయంపై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

దిలావర్పూర్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త

లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లీలో గుర్తు తెలియని వ్యక్తులు కురుమల కుల దైవమైన బీరప్ప దేవాలయాన్ని ధ్వంసం చేశారు. దీనికి నిరసనగా దిలావర్పూర్ గ్రామంలోని కురమలు ఆ గ్రామానికి వెళ్లి బీరప్ప ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీరప్ప ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిని తొందరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరారు. లేనియెడల పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా కురుమలు నిరసనలు చేస్తామని హెచ్చరించారు. ఈ ఇందులో గుర్రపు ముత్యం, మస్కరి భోజన్న, కర్రోళ్ల గంగాధర్, కర్రోల మాణిక్యరావు, కర్రోల్ల చిన్న ముత్యం, మస్కరి దశరథ్, అవర్గ సాయికుమార్, గొల్ల ముత్యం తదితరులు ఉన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేయాలి

### - బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేయాలి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం సిర్పూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దమెరపల్లి వెంకటేశ్ సుధ దంపతులు తమ కార్యకర్తలతో కలిసి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీలో చేరారు. అదే విధంగా, లోనవెల్లి గ్రామ పంచాయతీకి చెందిన కేడం రాజు కూడా బిఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ చేరికతో బిఆర్ఎస్ పార్టీ స్థానికంగా మరింత బలోపేతం కానుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యామ్ రావ్, కొంగ సత్యనారాయణ, మండల కన్వీనర్ అస్లాం బిన్ అబ్దుల్లా, నందాజి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

వేమనపల్లి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త

నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలలో నీల్వాయి ఎస్సై కోటేశ్వర్ రాబోయే చలికాలం దృష్టిలో పెట్టుకొని కల్లంపల్లిలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే మామడ గ్రామంలో నిరుపేదలకు నూనె ప్యాకెట్స్,పప్పులు అందజేశారు. ఈ సందర్భంగా వారు యువతను ఉద్దేశించి మాట్లాడుతూ నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ కాంపిటీషన్ ప్రిపేర్ అయ్యే వారికి యువతి యువకులకు చదువులో మెలకువలు, జాబుకు ఎలా ప్రిపేర్ కావాలి అనే టెక్నిక్స్ కూడా నేర్పిస్తానని తన వంతుగా అందరు జాబ్ కొట్టే విధంగా సహాయపడతానని తెలిపారు.



## గుంతలు పూడ్చిన గ్రామస్తులు

బోథ్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త

మండలంలోని సోనాల సాకేర గ్రామ సమీపంలో సోమవారం బెంగళూరు నుండి నేపాల్ వెళుతున్న ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురి అయిన సంగతి తెలిసిందే. అయితే ప్రమాదం జరిగిన స్థలంలో గుంత ఏర్పడడం జరిగింది. అది గ్రహించిన గ్రామస్తులు వచ్చిపోయే వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా సోనాల గ్రామస్తుడు రామ్ రెడ్డి సహాయంతో బోథ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అధికారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గుంతను పూడ్చడం జరిగిందనీ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పొచ్చర ఎక్స్ రోడ్డు నుండి సాకేర గ్రామం వరకు భారీ వర్షాల కారణంగా రోడ్డు మొత్తం గుంతలుగా మారిందని దానితో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కావున వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని తెలిపారు.

## విజ్ఞానానికి అంగవైకల్యం ఆటంకం కాదు

### ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించిన విద్యార్థిని

కౌటాల, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త

మండలంలోని గురుడు పేట గ్రామానికి చెందిన బూర్ల సంతోష్-కళ్యాణి దంపతుల కూతురు బూర్ల అవంతి, నీట్-2025లో ఆల్ ఇండియా దివ్యాంగుల కేటగిరీలో 2671వ ర్యాంకు సాధించి, ప్రఖ్యాత ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సంపాదించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ ఏ. భాస్కర్‌తో కలిసి ఆమెను సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని వైకల్యం ఏది ఆటంకం కాదని అవంతి దానికి నిదర్శనం అని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పరంగా అవసరమయ్యే సహాయం అందిస్తాం అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ మహేష్ పాల్గొన్నారు.



# తెలంగాణ శ్రామిక మహిళా రాష్ట్ర కన్వెన్షన్ సమావేశాన్ని జయప్రదం చేయండి

**- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామ్రేడ్ భూపాల్**



**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

కాగజ్ నగర్ పట్టణంలోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో అక్టోబర్ 5,6వ తేదీల్లో నిర్వహించే శ్రామిక మహిళా సమన్వయ తెలంగాణ స్టేట్ కన్వెన్షన్ సమావేశాన్ని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ భూపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని యాదవ సంఘం భవనంలో తెలంగాణ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వెన్షన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వచ్చిన కామ్రేడ్ భూపాల్ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు హాజరై మాట్లాడుతూ అక్టోబర్ 5, 6 తేదీలలో జరగనున్న సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుండి 1,000 మంది మహిళా ఉద్యమ నాయకులు ప్రతినిధులుగా హాజరవుతున్నారని అన్నారు. రాష్ట్రంలో శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ భద్రత కోసం చేయాల్సిన భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందించుటకు భవిష్యత్తు ఉద్యమ అవసరాల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, కార్మిక శ్రేయోభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు నేడు అన్ని రంగాలలో మహిళలు ముందుంటున్నారు. ఒకపక్క ఉద్యోగ బాధ్యతలు, మరోపక్క కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. కానీ ఎక్కడికి వెళ్ళినా, ఏ స్థాయిలో ఉన్నా మహిళలపై వేధింపులు, వివక్ష, అవమానాలు తప్పడం లేదు. ఉపాధి కల్పనలో మహిళలు అసమానతలు ఎదుర్కొంటున్నారు. భారతదేశంలో శ్రామిక మహిళా + శక్తి భాగస్వామ్య రేటు కేవలం 28.4 మాత్రమే. తెలంగాణ రాష్ట్రంలో ఈ సంఖ్య ఇంకా తక్కువగా ఉంది. 90 మంది మహిళలు అసంఘటిత తరంగంలో పనిచేస్తున్నారు. వారికి సామాజిక భద్రత, రక్షణ లేదు. సమాన వేతనాలు కూడా లభించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎస్ పి ఎం పేపర్ మిల్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కూశన రాజన్న సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్ ముంజం శ్రీనివాస్ శ్రామికమహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ త్రివేణి గారు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి, ముంజం ఆనంద్ కుమార్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గేడం టికానంద్ గొడిసెల కార్తీక్ఆ తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నేర్పల్లి అశోక్ కొరెంగ మాలశ్రీ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయిధ్వ ఇళ్ల కార్యదర్శి దుర్గా అనిత తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎస్సైకి సన్మానం

**వేమనపల్లి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

నూతనంగా నీల్వాయి ఎస్సై కోటేశ్వర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం నేతకాని మహర్ సేవా సంఘం నాయకులు స్వాగతిస్తూ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కుడుకల శ్రీనివాస్ నేత, వేమనపల్లి మండల అధ్యక్షులు కామెర గణేష్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెరుగు దాసు, జిల్లా నాయకులు జాడి గోపాల్ నేత, మండల ఉపాధ్యక్షులు దుర్గం మదునయ్య, మండల ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, మండల సహాయ కార్యదర్శి జుమ్మిడి శంకర్, మండల కోశాధికారి గుదెపెల్లి గణపతి, మండల నాయకులు దుర్గం తిరుపతి, కామెర చెంద్రమోళి, కొండగొర్ల ధర్మయ్య, బొర్కుటి మురళి పాల్గొన్నారు.



# ఘనంగా బతుకమ్మ వేడుకలు

**- ఇంటింటా నెలకొన్న పండగ వాతావరణం**

**బోథ్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన మన రాష్ట్ర పండుగ బతుకమ్మను భాద్రపద అమావాస్యనాడు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహించి సద్దుల బతుకమ్మతో ముగిస్తుంది. ఆడబిడ్డలను పుట్టింటికి ఆహ్వానించి సుఖసంతోషాలు ప్రసాదించాలని గౌరమ్మను పూజించి జరిపే ఈ పండుగను మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో మంగళవారం ఆడపడుచులు బతుకమ్మను పేర్చి రంగురంగుల ముగ్గులు, వేసి తంగేడు పువ్వులతో అలంకరించి. గౌరమ్మకు పూజలు నైవేద్యాలు సమర్పించి చిన్నారులు, మహిళలు రాత్రి 9.30 ల సమయంలో తమ ఆటపాటలు, కొలలతో నృత్యాలు చేస్తూ సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా ప్రతిరోజు జరుపుకుంటారు.

## పత్తి పంటలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు: ఎస్సై

**కెరమెరి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**



మండలంలోని ఇందాపూర్ గ్రామ శివారులో వడై పోశెట్టి అనే వ్యక్తి తన పత్తి పంటలో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు కెరమెరి ఎస్సై మధుకర్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు తనిఖీల చేయగా వాడై పోశెట్టి పత్తి పొలంలో మొత్తం 130 గంజాయి మొక్కలు ఉన్నట్లు గుర్తించమన్నారు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి సాగు చట్టరీత్యా నేరమని, గంజాయి సాగు లేదా అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సాగు చేయకూడదు, ఇది తీవ్రమైన శిక్షార్హమైన నేరం. ఎవరైనా గంజాయి సాగు చేస్తూ గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాజంలో యువత భవిష్యత్తు దృష్ట్యా గంజాయి వంటి మత్తు పదార్థాలను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

## పేకాటరాయుళ్ళ అరెస్ట్

**వేమనపల్లి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సి వాడలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై కోటేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి వారి వద్ద 1000రూపాయిలు,52పేకాట కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.



## పోషకాహారమే ప్రధాన లక్ష్యం

**పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం చెడ్వాయి అంగన్వాడీ సెంటర్‌లో శ్రీమంతాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యవేక్షణ అధికారి హసీనా మాట్లాడుతు పిల్లల భవిష్యత్తు కోసం ఆరోగ్యాకరమైన ఆహారం అవసరమని పోషణ మాసం ఒక నెలపాటు మాత్రమే కాకుండా ప్రతిరోజు సమతుల్య ఆహారం తీసుకోవడం ఒక అలవాటుగా మార్చుకోవాలని తల్లులకు తెలిపారు. ఈ కార్యక్రమములో సిడిపిఓ విజయలక్ష్మి ఎసిడిపిఓ హేమలత, బెజ్జూర్ మండల పర్యవేక్షణ అధికారి కరుణ అంగన్వాడీ టీచర్లు రాజమణి, లీలా, కుమారి, పద్మ, కమల, సరోజ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి

**నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన**

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీనివాస్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్, సిబ్బంది ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జిజిహెచ్ ఆసుపత్రి వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతు వైద్య వృత్తి పట్ల గౌరవంతో మెలగాల్సిన సమాజంలో ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వాహణలో వైద్యులకు, సిబ్బందికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని, ఇలాంటి దాడులు భవిష్యత్తులో జరుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




# మైక్రో బ్రేవరీల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలి

**- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి**

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

మైక్రో బ్రేవరీల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి డిమాండ్ చేశారు. నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కొమురం భీం జిల్లా సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆబ్కారీ కార్యాలయంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరిండెంట్ జ్యోతి కిరణ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ ను కట్టడి చేస్తానంటూనే ఇంటి వద్దకే డ్రాఫ్ట్ బీర్ పాలసీ నిర్ణయం సిగ్గు చేటన్నారు. మైక్రో బ్రేవరీల ఏర్పాటు వలన విద్యార్థులు, యువతపై సామాజిక ప్రభావం, మద్యం అధిక వినియోగం, హింస, అశాంతి, నియంత్రణ లేకపోవడం, ఆరోగ్యపరమైన సమస్యలు ఉత్పన్నమోతాయని ఆవేదన వ్యక్తంచేశారు. అదేవిధంగా మైక్రో బ్రేవరీల ఏర్పాటు నిర్ణయంతో తెలంగాణలో మద్యం ఏరులై పారుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మైక్రో బ్రేవరీల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ను రద్దు చేయాలని లేనిపక్షములో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కోదురుపాక మహేష్, వర్కోల్ రాకేష్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఏఐటీయూసీ ఆందోళనల ఫలితంగానే లాభాల వాటా ప్రకటన

## - ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య




**నస్పూర్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

సింగరేణి వ్యాప్తంగా ఏఐటీయూసీ చేసిన ఆందోళనల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం లాభాల వాటా ప్రకటన చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం నస్పూర్ ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడుతూ, గుర్తింపు సంఘంతో చర్చించకుండా యాజమాన్యం ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వంతో లాభాల వాటా ప్రకటన చేయించడం సరైన విధానం కాదని, సోమవారం సింగరేణి భవన్‌లో జరిగిన సమావేశంలో తీవ్రంగా వ్యతిరేకించినట్లు, యాజమాన్యం తీరు కార్మికులు, గుర్తింపు సంఘాన్ని అవమానించడమేనని అన్నారు. కాంట్రాక్టు కార్మికుల వల్ల లాభాలు వస్తున్నాయని చెబుతున్న యాజమాన్యం పది వేల బోనస్ చెల్లించకుండా, బిక్షం లాగా 500 రూపాయలు పెంచడం ఏంటని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో సింగరేణి లాభాల వాటా ప్రకటనలో అప్పటి ముఖ్యమంత్రులు గుర్తింపు సంఘం, యాజమాన్యంతో చర్చలు జరిపి, లాభాల వాటా ప్రకటించే ఆనవాయితీ ఉండేదని, కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యే ల సమక్షంలో లాభా ల వాటా ప్రకటన విధానాన్ని తీసుకువచ్చారని, అదే విధానాన్ని ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తుందని, కేసీఆర్ ప్రభుత్వానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ విధానాలనే సింగరేణిలో అమలు చేస్తోందని ఆరోపించారు. కార్మికుల స్వంత ఇంటి పథకం, మారుపేర్ల సమస్య, కొత్త గనులు, అలవెన్సుల పై ఆదాయపు పన్ను చెల్లింపు తదితర సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, ఏరియా సెక్రటరీ సుధాకర్, బెల్లంపల్లి కాంటాక్ట్ కార్మికుల సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్,ట్రేడ్స్ మెన్ ఇంచార్జి సురేష్, నాయకులు సందీప్, తౌటం మల్లేష్, లక్షుఋఋ మ్రణ్, విక్కీ, తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిలో బతుకమ్మ పండుగ వేడుకలు



**మందమర్రి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియాలోని సిఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోమవారం రోజున సాయంత్రం బతుకమ్మ ఆట పాట (ఫ్యామిలీ డే) వేడుకలను మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ, మందమర్రి ఏరియ సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు ఎన్. శ్రీవాణి రాధాకృష్ణలు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ బతుకమ్మ ప్యామిలీ డే ఆట పాట కార్యక్రమానికి సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబీకులకు, అధికారులకు, సింగరేణి కార్మిక సంఘం నాయకులకు, సేవా సమితి సభ్యులకు, మహిళలకు పిల్లలకు, ప్రజలకు ముందస్తుగా సద్దుల బతుకమ్మ మరియు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఆదేశాల మేరకు సద్దుల బతుకమ్మ కార్యక్రమంలో భాగంగా ఫ్యామిలీ డే ఆటపాట వేడుకలను అందరు కుటుంబ సభ్యులు ఒక్క దగ్గర చేరి ఆహ్లాదంగా గడపాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు.అలాగే ఈ రోజు నిర్వహిస్తున్న ఈ బతుకమ్మ ఆట పాట కార్యక్రమానికి మీరంతా తరలి రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఈ వేడుకలలో భాగంగా బతుకమ్మ ఆట, పాట, డ్యాన్సుల పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం విజయ ప్రసాద్, ఏఐటియుసి మందమర్రి జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సిఎంఓఏఐ అధ్యక్షులు రమేష్, సీనియర్ పిఓ శంకర్, అన్ని గనుల ప్రాజెక్ట్ ఆఫీసర్లు, మేనేజర్లు, మరియు సంక్షేమ అధికారులు, మహిళలు, సేవ సభ్యులు, లేడీస్ క్లబ్ సభ్యులు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

## ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలి - అచలభారత కార్మిక సంఘాల కేంద్రం, ఎంసిపిఐయు పార్టీ డిమాండ్

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బెల్లంపల్లిలోని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది అనంతరం ఏఐసిటియు రాష్ట్ర నాయకులు, ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి, పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లేబర్ బోర్డు కార్మికులకు సంబంధించి యాక్సిడెంట్, నార్మల్ డెత్ లకు సంబంధించి ఎంక్వయిరీ (విచారణ) రిపోర్ట్ లేబర్ బోర్డులకు సబ్మిట్ చేయడానికి ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడం వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరగడమే కాకుండా అవినీతి జరిగే ఆస్కారం ఉందనీ, ప్రైవేట్ కంపెనీలకు సంబంధించి ఏజెంట్లు కార్మికులను తీవ్ర ఇబ్బందులు పెడుతూ డబ్బులు వసూలు చేసే అవకాశాలు ఉన్నాయని, ఏదైతే లేబర్ బోర్డు పునారాలోచించి కార్మికులను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చినటువంటి అనుమతులు వెంటనే రద్దుచేసి, పాత పద్ధతిలోనే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని, కార్మికులకు న్యాయం చేయాలని లేనియెడల అచల భారత కార్మిక సంఘాల కేంద్రం మరియు భారత మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) పార్టీ మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో లేబర్ బోర్డును ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి అరె పెల్లి రమేష్, షేక్ సర్వర్, పోచం, బాలయ్య, నవీన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

